
సూర్యలంక సముద్రతీరంలో గజఈతగాళ్లతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

తుఫాన్‌తో తీరంలో గోతులు

యథాస్థితికి మరో రెండు రోజులు

బీచ్‌లో పరిస్థితులపై కలెక్టర్ పరిశీలన

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో సూర్యలంక సముద్రతీరంలో లోతైన గుంతలు ఏర్పడినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బీచ్ సందర్శన, ప్రస్తుత పరిస్థితులపై బుధవారం కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులు, గజ ఈతగాళ్లతో మాట్లాడారు. రెండు రోజుల్లో బీచ్‌లో ఏర్పడిన గుంతలు పూడిపోయి యథాస్థితికి వస్తుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోతుల కారణంగా పర్యాటకులను, కార్తిక భక్తులను బీచ్ సందర్శన నిషేధించినట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

దేశంలోనే సూర్యలంక బీచ్ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బీచ్‌ను సర్వాంగ సుందరంగా ఉంచాలన్నారు. పర్యాటక మిత్ర సిబ్బందితో బీచ్‌లో గస్తీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి ప్రత్యేకంగా యూనిఫామ్, వాకీటాకీలు ఇవ్వాలన్నారు. బీచ్‌లో ఉన్న సీసీ కెమెరాలను, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ షెల్టర్‌ను పునరుద్ధరించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట డీపీవో ప్రభాకర్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఎస్పీ జి.రామాంజనేయులు, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు ఉన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.కోట్లు స్వాహా

అమృతలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభయాన్ ద్వారా కంప్యూటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నియోజక వర్గానికి చెందిన ఓ వ్యక్తి నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు స్వాహా చేశాడన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గం లోని ఓ గ్రామానికి చెందిన అతడు గతంలో ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్యాలయం కూడా ఏర్పాటు చేసి కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు అంటూ నిరుద్యోగులకు గాలం వేశాడు. ఓ మంత్రిత్వశాఖలో ఉన్నతాధికారి సహకారం ఉందని అతడు బహిరంగంగానే చెప్తున్నట్లు పలువురు తెలిపారు. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. భట్టిప్రోలు మండలానికి చెందిన వారు ఎక్కువగా ఇతడి గాలానికి చిక్కినట్లు తెలిసింది.

సర్వపాప హరణం జ్వాలా తోరణం



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు, అమరేశ్వరుడు

వైభవంగా కార్తిక పౌర్ణమి పూజలు

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు


కోటప్పకొండ దేవస్థానంలో జ్వాలా తోరణం

రేపల్లె, అద్దంకి, కోటప్పకొండ, అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తిక మాసం పౌర్ణమికి ఆలయాలు బుధవారం భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణతో మారుమోగాయి. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, దీపారాధనలతో ఆధ్యా త్మికం వెల్లివిరిసింది. దేవస్థానాలు దీపతోరణాలతో వెలుగులు విరజి మ్మాయి. నిండు పౌర్ణమి కాంతులు భువి నుంచి ఆకాశంలో పరిచినట్లు.. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాల ను ఆలయాల ప్రాంగణాల్లో వెలిగించి.. ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ప్రము ఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. విశేష అభిషేకాలు నిర్వహించి కోటయ్య స్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. రాత్రి నేత్ర పర్వంగా జ్వాలా తోరణం జరిగింది. స్వామికి అఖండ పూజ చేశారు. గిరి ప్రదక్షిణ కోలాహలంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపారాధనలు చేశారు.

ముక్తేశ్వరస్వామి ఆలయంలో..

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని రేపల్లెలోని పెనుమూడి, మోర్తోట వద్ద కృష్ణా నదిలో భక్తులు పుణ్యస్నానాలచరించారు. కార్తిక దీపారాధనలు చేసి.. గౌరమ్మకు పసుపు, కుంకుమ పూజలు చేశారు. ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి, అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి, మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామివార్లకు ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

పులకించిన అమరేశ్వరాలయం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని బాల చాముండికా సమేత అమరేశ్వరాలయానికి వేలాది మంది భక్తులు కార్తిక పౌర్ణమి పూజలకు తరలి వచ్చారు. ఉదయం కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. తొలి అభిషేక కార్యక్రమంలో దేవస్థాన వంశ పారం పర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్ర సాద్ దంపతులు పాల్గొని, పూజలు నిర్వహించారు.


మోర్తోట ముక్తేశ్వరస్వామిదేవాలయంలో పౌర్ణమిపూజల్లో పాల్గొన్న భక్తులు


అద్దంకిలోని పాతశివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అమరావతి: క్యూలో భక్తులు



గుంటూరు సంపత్‌నగర్ శారదా పీఠంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అమరావతి: కృష్ణానదిలో దీపాలు వదులుతున్న దంపతులు

రెండు కార్లు ఢీ.. ఇద్దరు మృతి

మరో ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

చిలకలూరిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - చీరాల హైవేపై చిలకలూరిపేట మండలం పసుమర్రు వద్ద బుధవారం రెండు కార్లు ఢీకుని ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడినట్లు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. వింజనంపాడులో అంత్యక్రియల కార్యక్రమానికి హాజరై వస్తున్న ఓ కారు, చీరాల నుంచి వచ్చిన కారును ఢీకొట్టింది. దీంతో వింజనంపాడు నుంచి వస్తున్న కారులోని ఐదుగురిలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మిగిలిన వారు గాయపడ్డారు. మృతి చెందిన వారిని బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబోట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి విజయలక్ష్మి(56), పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈపూరివారిపాలేనికి చెందిన కనపర్తి వరలక్ష్మి(70)గా గుర్తించారు. కాగా అదే కారులో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సాదినేని సుధీర్‌బాబు వింజనంపాడువాసిగా గుర్తించారు. ఉప్పుగొండూరుకు చెందిన నూతలపాటి సుబ్బారావు, కోనంకికి చెందిన వజ్జా సాహిత్య స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారు చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి.

రెవెన్యూ డివిజన్‌గా.. అద్దంకి

- 10న మంత్రి మండలి సమావేశంలో ఆమోదం?

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి వాసుల రెవెన్యూ డివిజన్ కల సాకారం కానున్నది. జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్లపై చర్చించేందుకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన ఉపసంఘం బుధవారం సమావేశమైంది. ఈ సమావేశంలో కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు ప్రతిపాదించగా అందులో అద్దంకి కూడా ఉంది. ఈ క్రమంలో ఈ నెల 10వ తేది జరిగే మంత్రి మండలి సమావేశం లో కొత్త రెవెన్యూ డివిజన్లపై తీర్మానం చేసే అవకాశం ఉంది.



కనుల పండువుగా శాంతి కల్యాణం

మార్టూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని జొన్నతాళి గ్రామం భక్తజనంతో ఆధ్యాత్మిక వాతావరం సంతరించుకుంది. గ్రామంలోని గంగమ్మ తల్లి దేవస్థానంలో శ్రీగంగా పార్వతీ సమేత మహా కాళేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శర్మ ఆధ్వర్యంలో జరిగిన స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ప్రజలు కనుల పండువుగా తిలకించారు. గ్రామంలో తొలిసారిగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో గంగా పార్వతీ సమేత శ్రీమహా కాళేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. తదుపరి భక్తులకు కమిటీ సభ్యులు అన్నసంతర్పణ చేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

శింగరకొండకు భారీగా తరలివచ్చిన భక్తులు

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ గిరి ప్రదక్షిణ బుధవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభమైన గిరి ప్రదక్షిణ అభయాంజనేయస్వామి విగ్రహం, గోపాలపురం, భవనాసి చెరువు మీదగా సాగింది. ప్రదక్షిణ అనంతరం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద దామోదరస్వామి పూజ నిర్వహించారు. ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, కరి రమాసుందరి, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


శింగరకొండలో పూజలు నిర్వహిస్తున్న ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్లు గుంజి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు


గిరి ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

లెక్కల్లో.. వ్యత్యాసాలు

రైతులకు ప్రతిబంధకంగా మారిన నిబంధనలు

సీఎం యాప్‌లో నమోదు కాని 30 వేల ఎకరాలు

పంట నష్టం నమోదుకు రెండు రోజులు గడువు పెంపు

పొంతనలేని అంచనాలు.. గణాంకాలు

(బాపట్ల, చీరాల, ఆంధ్రజ్యోతి) మొంథా తుపాన్ రైతులను నిండా ముంచేయగా.. పరిహారంపై అనుమానాలు నెలకొం టున్నాయి. తుఫాన్ తీరం దాటిన మరుస టి రోజే పంట నష్టంపై వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం ఉద్యాన పంటలతో కలుపుకుని జిల్లాలో 84,500 ఎకరాలు ముంపు బారిన పడినట్లు తేల్చింది. అప్పటికే జిల్లావ్యాప్తంగా దాదాపు 80 శాతం పొలాలు ముంపులోనే ఉన్నాయి. ఆ తర్వాత వాగులకు గండ్లు పడడంతో పొలాలను వరద నీరు ముంచెత్తిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు పెరుగుతాయని అందరూ భావించారు. అయితే ప్రస్తుతం గురువారం వరకు నష్టం తుది అంచనాలను చూస్తే ప్రాథమిక నివేదికలతో పోల్చుకుంటే తక్కువగా ఉండే అవకాశాలు కనబడుతున్నాయి. ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నష్టం వివరాల నమోదు ఆధారంగానే పం ట విస్తీర్ణం లెక్క తేల్చాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే దీనినే ప్రామాణి కంగా తీసుకుంటే అర్హు లైన ఎంతో మంది రైతుల కు అన్యాయం జరిగే అవ కాశం ఉందని ఆంధ్ర జ్యోతి ముందే హెచ్చరించింది. తుఫాన్ ఆసాంతం ముంచేసిందని ఉదా రంగా ఆదుకోవాలని రైతుల అభ్యర్థిస్తున్నారు. అయినా ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నిక్షిప్తం చేసిన నష్టం వివరాలనే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు సమాచారం. నష్టం వివరాలను ఎయిమ్స్ యాప్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ వారం రోజులుగా ముమ్మరంగా సాగింది. బుధవారం నాటికి దాదాపు 42,000 ఎకరాలకు సంబంధించి నష్టం వివరాలు యాప్‌లో నమోదైనట్లు యంత్రాంగం చెబుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు గురువారంతో ముగియగా మంత్రి అచ్చెన్నాయుడు మరో రెండు రోజులు పెంచారు. అయినా తుది లెక్కలు 55,000 ఎకరాల వద్దే ఆగిపోనున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక లెక్కల ప్రకారం 84,500 ఎకరాల్లో పంట ముంపు బారిన పడినట్లు తేలిన సంగతి తెలిసిందే. అంటే దాదాపు 30,000 ఎకరాల వ్యత్యాసం కనబడుతోంది.


ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది(పాతచిత్రం)

మాన్యువల్ నమోదుపై లేని స్పష్టత

ప్రాథమిక నివేదికలకు, తుది జాబితాకు పొంతన లేకపోవడా నికి సాంకేతిక అంశాలు కారణ మని తెలుస్తోం ది. నిబంధనల ప్రకారం ఎయి మ్స్ యాప్‌లో నష్టం వివరాలు నమోదు కావాలంటే, సదరు పంట విస్తీర్ణం ఈ-క్రాప్‌లో రికార్డై ఉండాలి. అది కూడా పంట వివరాలు కూడా మ్యాచ్ అవ్వాలి. ఈ నిబంధనలు రైతులకు ప్రతిబంధకంగా మారనున్నాయని వ్యవసాయశాఖ సైతం తే ల్చింది.అయితే మాన్యువల్ నమోదుపై తమకు ఎలాంటి ఆదేశాలు లేవనేది యంత్రాంగం మా ట. సీసీఆర్‌సీ కార్డులు, ఇప్పటికే భూయజమాని పేరు ఎయిమ్స్ యాప్‌లో నిక్షిప్తం అయి ఉండడం వంటి సాంకేతిక అంశాలన్నీ కూడా నిజంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు గుదిబండగా మారి పరిహారానికి దూరమయ్యే అవకాశాలున్నాయి.

తీవ్ర సంక్షోభంలో రైతులు..

మొంథా తుపాన్‌కు సరిగ్గా పదిరోజులకు ముందే దాదాపు 6,800 ఎకరాల పంట ముంపు బారిన పడినట్లు వ్యవసాయశాఖ తేల్చింది. ఆ తర్వాత తుపాన్ మొత్తాన్ని ఊడ్చేసింది. రోజుల తరబడి పంట నీళ్లల్లో ఉండడంతో కుళ్లిపోయి పనికి రాని స్థితికి చేరుకుంది. జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 2,85,000 ఎకరాలుగా ఉంది. ఇందులో 75 శాతం వాటా వరిదే కాగా, మొన్నటి ముంథా తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయింది కూడా వరి రైతే. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం అంచనాల ప్రకారం ప్రిలిమనరీ నివేదికలనే రైతులు తప్పుబట్టారు. అలాంటిది ఇప్పుడే తుది జాబితా ప్రాథమిక నష్టం గణాంకాలకు ఆమడ దూరంలో ఉండడం మొత్తం ప్రక్రియపైనే అనుమానాలు రేకెత్తించే విధంగా ఉన్నాయి.

పలు కారణాలు..పాతికేళ్ల కుర్రాళ్లు ముగ్గురు మృతి

నాదెండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల ఒకటిన గడ్డి మందు తాగిన కొండెబోయిన్ అశోక్(26) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అశోక్ భార్య భవానీ దివ్యాంగురాలు. కొద్ది రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లింది. భార్యను పంపాలని అత్త వెంకాయమ్మ, బావమరిది కొండయ్యను అశోక్ కోరాడు. వారి మధ్య ఫోన్‌లో వాగ్వివాదం కూడా చోటుచేసుకుంది. పొలానికి పురుగు మందు కొట్టడానికి వెళ్లిన అశోక్.. అక్కడే గడ్డి మందు తాగి రైతుకు ఫోన్ చేశాడు. రైతు అతనిని గుంటూరులోని ఓ హాస్పిటల్‌కు తరలించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో..

మాచవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వేమవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ తిరుపతిరావు వివరాల మేరకు.. వేమవరం గ్రామానికి చెందిన పూచిక సాగర్(25) రోజులాగానే పులిచింతల బ్యాక్ వాటర్ నిల్వ ఉన్న ప్రాంతంలో చేపలు పడుతుండగా.. కిందకు వాలి ఉన్న కరెంట్ తీగలకు అతని చేతిలో ఉన్న కర్ర పైకెత్తటంతో తగిలింది. షాక్‌కు గురై సాగర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి ఏసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

వినుకొండటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఏనుగుపాలెం రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వినుకొండలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న గట్టుపల్లి వెంకటసాయి (23) .. పని ముగించుకొని స్వగ్రామం నూజెండ్ల మండలం జంగాలపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వాహనం అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుప్రియ ఆరు నెలల గర్భిణి. వెంకటసాయి మృతి సమాచారంతో భార్య సుప్రియ, తల్లి శేషారత్నం రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరారాధన ఉత్సవాలకు శ్రీకారం

పోతురాజు శిలకు పడిగం కట్టిన పీఠాధిపతి చెన్నకేశవ అయ్యవారు

కారంపూడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కార్తిక పౌర్ణమి బుధవారం రాత్రి శ్రీకారం చుట్టారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు స్థానిక వీరుల దేవాలయంలో పోతురాజు శిలకు 101 పోగులతో పడిగం కట్టారు. వీరాచారవంతులు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో పీఠాధిపతి చెన్నకేశవ అయ్యవారును ఊరేగింపుగా వీరుల దేవాలయానికి తీసుకొచ్చారు. బ్రహ్మనాయుడు ఆయుధమైన నృసింహకుంతానికి, కన్నమదాసు భైరవ ఖడ్గానికి, నాగమ్మ వీర ఖడ్గానికి, బాలచంద్రుడి త్రిశూలానికి పూజలు జరిపారు.

పల్నాటి యుద్ధంలో అమరులైన వీరుల కుటుంబాలకు తమ పూర్వీకుల ఆయుధాలతో ఉత్సవాలకు తరలిరావాలని రాత్రి లేఖలు పంపారు. పల్నాడు, గురజాల రాజ్యాలకు యుద్ధభూమైన కారంపూడికి తమ సైన్యాలతో తరలిరావాలని ఆనాటి పెద్దలు పంపిన పిలుపు మేరకు పీఠాధిపతి పూర్వీకుల ఆయుధాలతో తరలి రావాలని కన్నమదాసుతో సమాచారం అందిస్తారు.



పోతురాజు శిలకు పడిగం కడుతున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు

'లూథరన్' పాఠశాల ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఉత్తర్వులు

● తిరస్కరించిన హెచ్ఎం పద్మలత

యడ్లపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి రిలీవింగ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంటనే రికార్డులు అప్పగించి రిలీవ్ కావాలని అందులో పేర్కొన్నారు. బుధవారం డిప్యూటీ డీఈవో సుభాని ఎంఈవో నాగరత్నంతో కలసి పాఠశాలకు వచ్చి ఉన్నతాధికారులు జారీ చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది రిలీవింగ్ ఉత్తర్వులను హెచ్ఎం పద్మలతకు అందజేయబోయారు. అందుకు తిరస్కరించిన హెచ్ఎం పాఠశాల మూసివేతను నిలిపివేస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని, ఉత్తర్వులు వచ్చేందుకు సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. అప్పటి వరకు రిలీవింగ్ ఉత్తర్వులు తీసుకోబోమని తేల్చి చెప్పారు. దీనితో రిలీవింగ్ ఉత్తర్వులను ఎంఈవో నాగరత్నం పాఠశాల నోటీసు బోర్డులో అంటించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



ఉత్తర్వులు అందజేసేందుకు వచ్చిన డీవైఈవో, ఎంఈవో

విజ్ఞాన్స్ వర్సిటీ కొత్త చాన్సలర్‌గా డాక్టర్ పావులూరి

గుంటూరు(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ నూతన చాన్సలర్‌గా ప్రముఖ శాస్త్రవేత్త, అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ పావులూరి సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అదేవిధంగా ఏపీ స్పేస్ అకాడమీ అధ్యక్షుడిగా, ఉత్తరప్రదేశ్ ఎకనామిక్ కౌన్సిల్ సభ్యుడిగా పలు కీలక హోదాల్లో ఉన్నారు. డాక్టర్ సుబ్బారావు గోవాడ గ్రామానికి చెందిన.. సాంప్రదాయ రైతు కుటుంబానికి చెందినవారు. ఉన్నత విద్య అనంతరం ఇస్రోలో 15 ఏళ్ల శాస్త్రవేత్తగా సేవలందించారు.



ఉత్తర్వులు చూపుతున్న డాక్టర్ పావులూరి, డాక్టర్ లావు రత్తయ్య

మిషన్ ఉన్నతితో ఉద్యోగోన్నతుల్లో జాప్యానికి స్వస్తి

● డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల ప్రమోషన్లలో జాప్యాన్ని నివారించేందుకు మిషన్ ఉన్నతిని అమలు చేస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ తెలిపారు. బుధవారం గుంటూరు డివిజన్‌లో విశ్రాంత ఉద్యోగుల స్థానంలో జూనియర్‌లకు ఈ మిషన్ కింద ఉద్యోగోన్నతలు కల్పించారు. విశ్రాంత ఉద్యోగి చేతుల మీదగానే ఉద్యోగికి ఆర్డర్ కాపీని అందజేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్ పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి పత్రాన్ని అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి చిత్రంలో డీఆర్ఎం, సీనియర్ డీపీవో

నూతన భవన సముదాయానికి రూ.5 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.5 లక్షల విరాళాన్ని నగరానికి చెందిన స్ట్రక్చరల్ ఇంజనీరు కోటపాటి రాఘవరావు ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, బాలికల వసతి గృహంలో కమ్మ జనసేవ సమితి గౌరవ సలహాదారు వంకాలయపాటి బలరామ కృష్ణయ్యకు ఆ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు మల్లేల హరేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ.. దాతలు ఇచ్చిన విరాళాల్ని పారదర్శకంగా ఖర్చు పెడుతున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఐదు వందల మందికి వసతి కల్పించేందుకు భవనాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అనంతరం దాతను సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. నూతలపాటి వెంకటేశ్వరరావు, సమితి కోశాధికారి కావూరి రవీచంద్ర, సంయుక్త కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, సభ్యులు మర్రిపూడి సీతారామయ్య పాల్గొన్నారు.



సమితి సభ్యులకు నగదు చెక్కు అందజేస్తున్న రాఘవరావు

హ్యాండ్‌బాల్ విజేత గుంటూరు జట్టు

తెనాలి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుపేట అమరావతి కాలనీలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఫైనల్స్‌లో గుంటూరు జిల్లా విజేతగా నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. చిత్తూరు జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలవగా..కడప జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేత జట్టు, ఇతర జట్లకు మహేంద్ర మోటార్స్ ఎండీ మధుసూదనరాజు బుధవారం జరిగిన కార్యక్రమంలో ట్రోఫీ, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, ఫెడరేషన్ కార్యదర్శి వినయ్, కిషోర్, పుట్టా జనార్దనరావు, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న మధుసూదనరాజు

కొలకలూరులో విషాదం..యువతి ఆత్మహత్య, యువకుడి గల్లంతు

తెనాలి క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొలకలూరులో వేర్వేరు ఘటనల్లో యువతి, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో మస్తరున్నీసా (21) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ యువతి ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంటి వద్దనే ఉంటోంది. ఇదే గ్రామానికి చెందిన షేక్ శిలార్ కుమారుడు, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న షేక్ ఖాజావలి(20) సాయంత్రం నాలుగు గంటల సమయంలో గ్రామ సమీపంలోని కొమ్మమూరు కాల్వలోకి దూకాడు. గల్లంతయిన యువకుడి కోసం బంధువులు, గ్రామస్తులు కాల్వ వెంట గాలిస్తున్నారు. గ్రామంలో ఒకే రోజు యువతి ఆత్మహత్య చేసుకోవడం, యువకుడు కాల్వలో దూకి గల్లంతవ్వడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న తెనాలి డీఎస్పీ, పట్టణ సీఐలు, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని కేసులను పరిశీలిస్తున్నారు.



షేక్ మస్తరున్నీసా (ఫైల్)



షేక్ కాజావలి (ఫైల్)

వెంటాడిన మృత్యువు..వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

బాపట్లరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు వివరాల మేరకు.. బాపట్ల పట్టణం ఇమ్మడిశెట్టివారిపాలేనికి చెందిన ఇమ్మడిశెట్టి అంజనేయులు (52) ద్విచక్ర వాహనంపై చీరాల నుంచి బాపట్లకు వస్తుండగా.. మద్దిబోయినవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.



అంజనేయులు మృతదేహం



ప్లాట్‌ఫాంపై మృతదేహం



వృద్ధుడిని ఢీకొట్టిన కారు

కారు ఢీకొని వృద్ధుడు మృతి

తెనాలి క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొలకలూరు బాపయ్య పేటకు చెందిన రాజవరపు సాంబయ్య (68) అనే వ్యక్తి కారు ఢీకొని.. బుధవారం మృతి చెందాడు. సాయంత్రం పొలం నుంచి ఇంటికి సైకిల్‌పై మెయిన్ రోడ్డు నుంచి వస్తుండగా.. వెనుక నుంచి వస్తున్న కారు టైరు పేలి అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో సాంబయ్య ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని మృతదేహం

తెనాలి రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం జీఆర్పీ పోలీసులు గుర్తించారు. ఉదయం ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. సుమారు 40 ఏళ్లు ఉన్న వ్యక్తి.. ఆకుపచ్చ గళ్ల చొక్కా ధరించి, చాతిపై హార్ట్ గుర్తు, అక్కడే బి.ఆర్.అని ఇంగ్లీష్ అక్షరాలతో పచ్చబొట్టు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతికి గల కారణాలు, వ్యక్తిగత ఆధారాలు లభించలేదని జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రి తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

జగన్ శవరాజకీయాలకు కాలం చెల్లింది

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, రెంటచింతల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ శవరాజకీయాలకు కాలం చెల్లిందని, అక్రమ మద్యం కేసులో జోగి రమేష్‌ను అరెస్ట్ చేస్తే కులాలను రెచ్చగొడుతున్నారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరదాల మాటున పరామర్శించడం, ఫ్యాంట్ పైకి లాక్కొని అన్నదాతల పట్ల మొసలి కన్నీరు కార్చే జనం నమ్మరని ఎద్దేవా చేశారు. కృష్ణా జిల్లాలో పంటల పరిశీలన పేరుతో జగన్ చేసిన హడావుడి, రోడ్లపై ప్రదర్శన చూస్తే ఎవరికైనా నవ్వు వస్తుందన్నారు. తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిని ఉంటే పరిశీలించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే బాగుండేదన్నారు. అలా కాకుండా కార్యకర్తల కేరింతల నడుమ ప్రదర్శన చేసినట్లు జగన్ యాత్ర కొనసాగిందన్నారు.

13,460 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు చేశాం

● మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాలలో నమోదైన రైతులలో 8,573 మంది రైతుల నుంచి రూ.99.69 కోట్ల విలువ కలిగిన 13,460 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గడిచిన నాలుగు నెలలు 53 కొనుగోలు కేంద్రాలను గుర్తించి 11 సహకార సంఘాల ద్వారా పొగాకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 161 రైతు సేవా కేంద్రాలలో 10,362 మంది రైతులు తమ పేర్లను పొగాకు అమ్ముకొనుటకు నమోదు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.65 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా సర్వే చేయించి అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు అనుమతికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

ధ్వంసమైన రోడ్డు.. ప్రయాణికుల ఇక్కట్లు



మూలపాలెం - జిల్లెళ్ళమూడి రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల క్రితం గ్రామాలను కలుపుతూ నిర్మించిన లింక్ రోడ్లు రూపురేఖలు కోల్పోతున్నాయి. ఇప్పటికే కర్లపాలెం నుంచి గుడిపూడి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్ద ఎత్తున ఏర్పడిన గుంతలలో నీరునిలిచి ప్రమాదాలకు కారణవుతోంది. అదే తరహాలో మండలంలోని మూలపాలెం గ్రామం నుంచి జిల్లెళ్ళమూడి వెళ్ళే రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు అప్పటి పాలకులు జమ్ములపాలెం-జిల్లెళ్ళమూడి ఆర్అండ్‌బీ రోడ్డుకు లింక్ చేస్తూ మూలపాలెం బీటీ రోడ్డును నిర్మించారు. దీంతో అటు జిల్లెళ్ళమూడి, కాకుమాను, జమ్ములపాలెం, బాపట్ల రాకపోకలకు ఈ రోడ్డు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం రోడ్డు ధ్వంసమై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వస్తే గుంతలలో నీరు నిల్వటం వల్ల ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతున్నది. సంబంధితాధికారులు, పాలకులు సమస్యపై స్పందించి రోడ్డును పునర్నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పంట నష్టం.. కౌలు రైతు ఆత్మహత్య

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంట దెబ్బతిని, అప్పులు తీర్చే మార్గంలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అత్తలూరులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బలుసుపాటి కోటయ్య(45) ఎనిమిది ఎకరాలు కౌలు తీసుకుని.. సాగుచేసిన పత్తిపంట ఇటీవల వచ్చిన వర్షాలు, తుపాన్ కారణంగా దెబ్బతింది. దీంతో అప్పు తీర్చే మార్గం లేక మనోవ్యధతో మంగళవారం అతను పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుటుంబ సభ్యులు అతనిని అమరావతిలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మూగజీవులను తరలిస్తున్న వాహనం పట్టివేత



లారీలో తరలిస్తున్న మూగజీవాలు

బాపట్లరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా లారీలో తరలిస్తున్న మూగజీవుల వాహనాన్ని బుధవారం వెదుళ్ళపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజు తెలిపిన వివరాలు ప్రకారం ఒడిస్సా నుంచి లారీలో 33 ఎద్దులను అక్రమంగా నెల్లూరుకు తరలిస్తుండగా వెదుళ్ళపల్లి చెక్ పోస్ట్ వద్ద అదుపులోకి తీసుకొని తనిఖీ చేయటం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ పశువుల లారీని బాపట్ల రైలుపేటలోని హిందూ గోశాలకు తరలించి కమిషనర్‌కు ఫిర్యాదు ఇవ్వటం జరిగిందని ఎస్ఐ భాగ్యరాజు ఈ సందర్భంగా తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

48,543 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,635 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,543 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,450 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	15500
నెంబరు. 5	10000	14300
273	----	----
341	10000	16100
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15400
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16000
దేవనూరు డీలక్స్	10000	15300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	15200
నెంబరు. 5	10000	14200
273	----	----
341	10000	16300
4884	11000	13800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300
బ్యాడిగి	10000	16000
దేవనూరు డీలక్స్	10500	15500
తాలుకాయలు	5000	8000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఎన్నికల కమిషన్ నీలం సాహ్నిని కలిసిన కలెక్టర్

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలోని హరితాబీచ్ రిసార్ట్స్‌కు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహ్ని విచ్చేశారు. ఆమెను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.


రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలంసాహ్నికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

పీజీఆర్ఎస్ సెంటర్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్


కమాండ్ కంట్రోల్‌రూమ్ పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్జీదారులకు నేరుగా ఫోన్ చేసి వారు సమర్పించిన అర్జీల పరిష్కార స్థితి గురించి ఆరా తీశారు. ఒక అర్జీదారుడి సమస్యపై వేటపాలెం తహసీల్దార్‌తో కలెక్టర్ స్వయంగా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాతీయ రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలి

జాతీయ రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిలుకలూరిపేట నుంచి ఓడరేవు ఎన్‌హెచ్ 167ఎ, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్ట్, ఇంటిగ్రేటెడ్ ఆక్వాప్రాజెక్ట్ నిర్మాణ పనులకు సంబంధించి ఎన్‌హెచ్ అధికారులు, మత్స్యశాఖాధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో కలెక్టర్ సమీక్షించారు. ఓడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి నిర్మాణానికి 88.38 హెక్టార్లలో భూమి సేకరించగా మిగిలిన 2 హెక్టార్‌లు త్వరగా సేకరించాలని ఓడరేవు, చీరాల, కారంచేడు, పర్చూరు తహసీల్దార్‌లను ఆదేశించారు. నిజాంపట్నం ఫిషరీస్ హార్బర్ అభివృద్ధి ప్రాజెక్ట్ సెకండ్‌ఫేజ్-2కు సంబంధించి చేపట్టిన పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని సంబంధితాధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఇంటి పన్ను ఆన్‌లైన్ ద్వారానే వసూలు చేయాలి : డీడీవో

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఇంటి పన్ను ఆన్‌లైన్ ద్వారానే వసూలు చేయాలని డీడీవో విజయలక్ష్మి తెలిపారు. బాపట్ల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డివిజనల్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇంటిపన్ను వసూళ్ళ పారదర్శకత కోసం స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. స్వామిత్వ సర్వేలో పురోగతి చూపాలని, వర్క్‌ఫర్ హోమ్, సిటిజన్ ఈకేవైసీ, విద్యార్థులకు ఆధార్ అప్‌డేషన్ తదితర కార్యక్రమాలన్ని త్వరగా పూర్తి చేయాలని విజయలక్ష్మి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సత్యసాయి సేవా మందిరంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆయుష్ శాఖ వారి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ సిద్దార్థ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా సేవా సభ్యులు, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి సబ్‌స్టేషన్‌లోని 11కేవీ చెరుకుపల్లి ఫీడర్ మరమ్మతుల నిమిత్తం చెరుకుపల్లి, ఆరుంబాక మొదలగు గ్రామాలలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ బి.పోతురాజు తెలిపారు.

శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో కళా చైతన్య కార్యక్రమాలు

పిట్టలవానిపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో కళాచైతన్య ఉద్దీపాన కార్యక్రమాలను నిర్వహించినట్లు త్రిముఖ దేవాలయాలకు చెందిన


పూజలు నిర్వహించుకుంటున్న బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ దంపతులు

కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. అమలాపురంనకు చెందిన ప్రముఖ ఆగమన పండితులు బ్రహ్మశ్రీ కె.రఘునాథశాస్త్రి భక్తబృందం ఆధ్వర్యంలో దేవస్థానం పండితులు, పూజారులతో కలిసి కార్యక్రమాలను నిర్వహించారు. బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. చందోలు ఎస్ఐ మర్రి వెంకటశివకుమార్, సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కలకోట చక్రధర్‌రెడ్డి దంపతులు, సభ్యులు వక్కలగడ్డ ప్రసాద్, చోడిగుడి రాంబాబు, ఆలయ పూజారులు కుంచాల నరసారెడ్డి, పిట్టు బల్లారెడ్డి, దొంతిబోయిన బల్లారెడ్డి, పిట్టు సోమురెడ్డి, పిట్టు వెంకటకృష్ణారెడ్డి, దొంతిబోయిన భానుచంద్రారెడ్డి, శ్రీలింగోద్భవ దేవస్థానం చైర్మన్ పి.రామకృష్ణసాయిబాబు పాల్గొన్నారు.

● చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ పాలకమండలి అధ్యక్షుడు పరిమి రామకృష్ణ సాయిబాబు, త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ప్రదోషకాలంలో ఆలయ ప్రముఖ మండపంలో సహస్ర దీపారాధన సేవ నిర్వహించారని తెలిపారు.

వైభవంగా శతచండీ యాగం


హోమం చేస్తున్న పండితులు, స్వాములు

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీ గంగాపర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయాల శతాబ్ది ఉత్సవాలలో భాగంగా మూడో రోజు బుధవారం శత చండీయాగం, మహారుద్ర యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. 484 రుద్రమంత్రంతో అభిషేకం చేశారు. 500 మంది మహిళలతో కోటికుంకమార్చన జరిపారు. అనంతరం ప్రవచనకర్త అవధాన సరస్వతీ డాక్టర్ తాతా సందీప్‌శర్మచే ప్రవచనం గావించారు. సాయంత్రం స్వామివారి శతాబ్ది మహోత్సవ శోభాయాత్ర జరిగింది. బ్రహ్మశ్రీ తాళ్ళపాక మణికంఠ శివాచార్యస్వామి యాజ్ఞీక పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొల్లిపర ప్రసాదస్వామి, గూడూరు చిట్టిబాబు, సాయివెంకట్, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంతరావు, అర్చక సహకారంతో ఆలయ ధర్మకర్తలు ఆదూరి హరినారాయణ పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

అమృతలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భవన నిర్మాణానికి బుధవారం దాత భూమి పూజ చేశారు. చెరుకుపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ళ కాశి, క్షేమంకరి దంపతులు భక్తుల సౌకర్యార్థం రెండు గదులతో భవన నిర్మాణం చేయనున్నారు. అర్చకులు శ్రీధర్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా అందజేత

కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీలోని టీడీపీ కార్యకర్త కనమర్లపూడి అజయ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా నామినీ అయిన వారి అమ్మకు రూ.5 లక్షల చెక్కును టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతి, ప్రధాన కార్యదర్శి షేక్ బాజి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, కుమ్మరికంట దాస్, బుల్లియ్య, పిట్ల వసంతరెడ్డి, కట్టా సుజాత, బొద్దుకూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన కుటుంబాలకు పరిహారం తక్షణమే పంపిణీ చేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని తక్షణమే పంపిణీ చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. నష్ట పరిహారం పంపిణీపై బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందిన 9,956 మంది బాధితులకు నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించినట్లుగా 13,074 మంది మత్స్యకారులకు, 8,260 మంది చేనేతలకు పరిహారం పంపిణీ చేయాలన్నారు. పరిహారం నగదును నేరుగా అర్హులైన వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలన్నారు. అదే విధంగా బియ్యం కార్డుల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు.

పంట నష్టం అంచనాల సర్వే వేగంగా పూర్తి చేయాలి

పంట నష్టం అంచనాల సర్వే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 18,486మంది రైతుల భూములు సర్వే చేసినట్లు వివరించారు. 36,818 ఎకరాల భూమిలో పంటలకు నష్టం జరిగిందన్నారు. 12,888 ఎకరాల భూమిలో పంటలు దెబ్బతిన్నాయని ధ్రువీకరిస్తూ అధికారులు అధికారికంగా నివేదించారన్నారు. మిగిలిన ప్రాంతాలలో సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పొగాకు పంట నష్టం వివరాలు స్పష్టంగా నివేదించాలన్నారు. ఈక్రాప్ బుకింగ్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 1,66,263 ఎకరాల పంటల సాగు వివరాలు నిక్షిప్తం చేశామన్నారు. 1060 గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టాలన్నారు. సమావేశంలో జేసీ భావన వశిష్ఠ, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ, డీఎస్‌వో జమీర్‌బాషా, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి రమేష్‌బాబు, మార్క్‌ఫెడ్ జీఎం కరుణశ్రీ, తహసీల్దార్‌లు, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నమోదైన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్

ఈక్రాప్‌లో నమోదైన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పలు సూచనలు చేశారు. ఈ క్రాప్‌లో నమోదైన పంటను బుధవారం కంకటపాలెం గ్రామంలో కలెక్టర్ సూపర్ చెక్ చేశారు. ఈ సందర్భంగా సర్వేనెంబరు 2లో ఈ క్రాప్ 5.9 వర్షన్, ఈపంట యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసిన మన్నెం నిమ్మికి చెందిన మూడు ఎకరాల 19 సెంట్ల పొలంలో వేసిన వరి పైరును కలెక్టర్ పరిశీలించారు. ఆమెకు ఫోన్ చేసి పంట వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని గ్రామ సర్పంచ్‌కు తెలిపారు. గ్రామంలో రెండు డొంకలలో రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామసర్పంచ్ కలెక్టర్‌ను కోరగా గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే రోడ్డు నిర్మాణం


కంకటపాలెంలో పొలాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

చేపడుతామని వారికి కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కె.శారద, కంకటపాలెం సర్పంచ్ మద్దిరాల వందనం, వీఆర్వో సుధారాణి, వీఏఏ షబీనా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను సుందరంగా తీర్చిదిద్దాలి

కలెక్టరేట్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరుగుతున్న మరమ్మతుల పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణమంతా పర్యటించి పరిశీలించారు. డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన కలెక్టర్ కార్యాలయ భవనం మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో భవనం కురుస్తున్నందున స్లాబ్‌కి పై భాగంలో కాంక్రీట్‌తో ప్లాస్టిక్ చేయాలని సూచించారు. దస్త్రాలను నిల్వ చేయటానికి ప్రత్యేక గది లేకపోవటంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. భవనంపై భాగంలో రికార్డుల రూమ్ నిర్మించాలని ఆర్‌అండ్‌బి డీఈ, కలెక్టరేట్ ఏవోలకు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రాత్రివేళ చీకటి లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఆర్ అండ్ బీ డీఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ ఎదుర్కొన్న అధికారులకు అభినందనలు

మొంథా తుఫాన్ బాపట్ల జిల్లాపై తీవ్ర ప్రభావం చూపినప్పటికి సమర్థవంతంగా ఎదుర్కోవటానికి కృషి చేసిన వారందరికి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా పని చేసిన వారందరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మొంథా తుఫాన్ ఎదుర్కోవటంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులందరికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

శివనామస్మరణతో మారుమోగిన దేవాలయాలు

● కార్తీక పౌర్ణమికి పోటెత్తిన భక్తులు

రేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం మహిళలు, పిల్లలు, పురుషులు పెనుమూడి, మోర్తోట కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి కార్తీక దీపారాధనలు చేసి గౌరమ్మకు పసుపు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి దేవాలయం, రేపల్లె రైలుపేటలోని శ్రీ స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్‌టౌన్ ఉమామహేశ్వరస్వామి ఆలయం, మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపారాధనలు చేసి శివాలయాల్లో ఏకాదశ మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, బాలకోటేశ్వరస్వామి దేవాలయం, మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో చెన్నమల్లేశ్వరస్వామి

● చెరుకుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని దేవాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు తెల్లవారుజామునుండే దేవాలయాలకు వెళ్ళి దీపాలు వెలిగించి అభిషేకాలలో పాల్గొన్నారు. నడింపల్లి శిఖరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం అనంతరం అరుణాచల దీప కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను భక్తులు తిలకించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నడింపల్లి శిఖరేశ్వరస్వామి


శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

● బాపట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో బుధవారం పెద్దఎత్తున కార్తిక పూర్ణిమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు చేరుకొని కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. శివలింగం ప్రదక్షణలు చేశారు. పట్టణంలోని శ్రీగంగాపార్వతి సమేత శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై దీపాలు వెలిగించి స్వామికి పూజలు చేశారు. చీలురోడ్డు సెంటర్‌లోని శ్రీ పాండురంగాస్వామి ఆలయంలో అర్చకులు కేశావాచార్యులు ఆధ్వర్యంలో కార్తీక దీపార్చన చేశారు. చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో దీపాలు వెలిగించారు.



జంపని రామేశ్వరాలయంలో జ్వాలాతోరణ ఉత్సవం

● వేమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన పూర్ణిమ తిథిని పురస్కరించుకుని మండల పరిధి గ్రామాల్లోని శివాలయాలలో బుధవారం వార్షిక జ్వాలాతోరణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి కార్తీక పూర్ణిమ దీపాలను వెలిగించారు. శివునికి అర్చకులు నమక చమకాలు రుద్రంతో విశేషంగా అభిషేకాలు జరిపి అలంకరించారు. సాయంత్రం గంగాపార్వతి సమేత పరమేశ్వరుని ఉత్సవమూర్తులను ప్రత్యేక పీఠంపై అలంకరించి ఆలయ ఉత్సవంలో భాగంగా ప్రత్యేక జ్వాలాతోరణ ఉత్సవాన్ని జరిపారు. చావలి, పెరవలి, వేమూరు, అబ్బనగూడవల్లి, కుచ్చెళ్లపాడు, జంపని, బూతుమల్లి, చదలవాడ గ్రామాలలో ఉత్సవ కార్యక్రమాలను వార్షిక పూజాకర్తలు నిర్వహించారు. జంపని రామేశ్వరాలయంలో గొంది వారి వంశస్తులు అత్యంత వైభవంగా జ్వాలాతోరణ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీప జ్యోతులతో స్వామికి హారతి సమర్పించారు. జంపని చెన్నకేశాలయంలో వార్షిక ఉత్సవం జరిపారు.

● కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం మండల పరిధిలోని చిలుమూరు, కోటిపల్లిలోని ప్రముఖ శైవక్షేత్రాలతో పాటు మండల గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులు ఆలయాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో కార్తీక దీపారాధనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం పలు ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. కొల్లూరులోని అనంత భోగేశ్వర ఆలయంలో భక్తులు శివలింగాకృతి రూపొందించి దీపాలు వెలిగించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


కొల్లూరు అనంత భోగేశ్వర ఆలయంలో భక్తులు రూపొందించిన శివలింగాకృతి

● చుండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మున్నంగివారిపాలెంలో తుంగభద్ర కాల్వ ఒడ్డున ఉన్న బ్రహ్మ ప్రతిష్ఠిగా భావించే ప్రాచీన శ్రీకాశీ విశ్వేశ్వర పాపనాశిని దేవాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి విశేష అర్చనలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాయంత్రం జ్వాలా తోరణం, దీపోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చినపరిమిలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో దీపోత్సవం, పౌర్ణమి వేడుకలు విశేషంగా జరిగాయి. వలివేరు, యడ్లపల్లి, చుండూరు మోదుకూరు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవాలను విశేషంగా నిర్వహించారు.


మున్నంగివారిపాలెంలో జ్వాలాతోరణం, దీపోత్సవం

● కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అగ్రహారంలోని శ్రీగంగా గౌరి సమేత బదరి కేదారేశ్వరస్వామి శివాలయం అర్చకస్వామి వాసుదేవశాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం భక్తులు కార్తీకమాసం పౌర్ణమి పూజలు నిర్వహించారు. తూనుగుంట్ల రామ్మోహన్‌రావు, పానుగంటి హరినాధబాబు, కృష్ణమూర్తిలు దాతల సహకారంతో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిమి రామకృష్ణశాయి, రామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.


కేదారేశ్వరస్వామి



నిజాంపట్నం మండలం గరువుపాలెం గ్రామంలో శాంతిదామ్ నిర్వహణలో శ్రీరఘురామ్ సొసైటీ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం మృత్యుకాలింగ మహారుద్రాభిషేకంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, పలువురు ప్రముఖులు, వివిధ రకాల పూలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

- గరువుపాలెం(రేపల్లె).

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత


సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం అందజేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆరు మంది అనారోగ్యంతో చికిత్స పొందారు. వీరు పేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీలు అందజేశారు. మొత్తం రెండు లక్షల 16 వేల 503 రూపాయలను చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాములపాటి వెంకట సుబ్బారావు, బేతాళ కిరణ్, అమర్తలూరి ప్రభాకరరావు, బాబు, వన్నా బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట నష్టం నమోదు పూర్తి


పంట నష్టం నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తీవ్రతకు దెబ్బతిన్న వరి పంట నష్టం నమోదు అంచనాలు పూర్తయినట్లు ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి బుధవారం తెలిపారు. కొల్లూరు మండలంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో నష్టపోయిన వరి పంటను పరిశీలించి నమోదు చేశారు. ఏవో నరేంద్రబాబు అనారోగ్య కారణాలతో సెలవు తీసుకోవడంతో భట్టిప్రోలు మండల వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డిని ఉన్నతాధికారులు ఇన్‌చార్జిగా నియమించి నమోదు ప్రక్రియను పూర్తి చేయించారు. కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో నష్టం అంచనాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సుమారు 1300 హెక్టార్లలో దెబ్బతిన్న వరి పైరును నమోదు చేశామని 2210 మంది రైతులు తుఫాన్ నష్టానికి ప్రభావితమైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే బుధవారం మధ్యాహ్నంతో నమోదు చేసే యాప్ నిలిచిపోయింది. తమ పంటలు నమోదు చేయలేదని రైతులు వ్యవసాయ కార్యాలయం వద్దకు వచ్చి సిబ్బందిని ప్రశ్నించడం గమనార్హం.


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్

చేనేత కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

చెరుకుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన చెరుకుపల్లి మండలం కనగాల గ్రామంలో చేనేత కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులను టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, గూడవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్రబాబు, మాజీ జడ్పీటీసీ పిట్టు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామ పంచాయతీ పరిధిలోని జుల్ఫాలంపాలెం వీధికి చెందిన ఎండీ హనీఫ్ దర్జీగా పనిచేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటిలోకి నీళ్ళు వచ్చాయని తెలుసుకొని చందోలు గ్రామ టీడీపీ యువ నాయకుడు సయ్యద్ నిజాం స్పందించి బుధవారం బాధితుడికి నిత్యావసర సరుకులు, బియ్యం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కే బాజి, అమీరా, ఎండీ సైదా పాల్గొన్నారు.

● కర్లపాలెం : శ్రీ ఛత్రపతి శివాజి మహారాజ్ ఫౌండేషన్, బాపట్ల ఆధ్వర్యంలో కర్లపాలెంలో బుధవారం మొంథా తుఫాన్ బాధితులైన 20 హమాలీల కుటుంబాలకు 10 కేజిల బియ్యం ఫౌండేషన్ అధ్యక్షుడు పెనుమెత్స శివాజి రాజు అందజేశారు. కార్యక్రమంలో ముదునూరి సతీష్‌కుమార్‌రాజు, వేగిరాజు, శ్రీనివాసరాజు, భాగ్యరాజు, కృష్ణకాంతు, సురేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) : భట్టిప్రోలులోని రెండో నెంబరు రేషన్ దుకాణ పరిధిలో ఉన్న 90 మంది చేనేత కార్మికులు ఇటీవల తుఫాన్ కారణంగా మగ్గాల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోయారు. వారికి 50 కేజీల బియ్యం, నిత్యావసరాలను టీడీపీ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. పంపిణీలో డీసీ అధ్యక్షుడు యర్రంశెట్టి కరుణశ్రీనివాసరావు, వేమూరు బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, తిరువీధుల బాలాజీ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జి.లెనిన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన

బాపట్లరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలతో బాపట్ల సబ్ డివిజన్ శక్తిటీమ్ బృందం బుధవారం బాపట్ల బీ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రావతి మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లలు తప్పనిసరిగా శక్తియాప్‌ను తమ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ నారాయణమ్మ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

కర్లపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలను నడిపే వారు హెల్మెట్ ధరించాలని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర అన్నారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద జాతీయ రహదారిపై ప్రజలకు ఎస్ఐ అవగాహన కల్పించారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు.

మోటారు వాహనం కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మూడుచక్రాల మోటారు వాహనం కొరకు అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు తెలిపారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బొలిమేర జయప్రకాష్, పుల్లగ ఏలీసమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వెంకటనరేంద్రకుమార్ మృతి

పిట్టలవానిపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మెండు వెంకటనరేంద్రకుమార్ (57) ఆకస్మికంగా మృతి చెందాడు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా బుధవారం మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, కనుమూరి సాంబమూర్తిరాజు, ఖాజీపాలెం టీడీపీ యువనాయకులు కొత్తపల్లి పృధ్వీరాజు, దండు శ్రీనివాసరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు, బంధువులు నివాళులర్పించారు.


వెంకటనరేంద్రకుమార్ (ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

బాపట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కర్లపాలెం రోడ్డులో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టటంతో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పట్టణ పోలీసులు గుర్తించారు. గాయాలతో ఉన్న ఆయనను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. స్పృహ లేకుండా చికిత్స పొందుతున్న సదరు వ్యక్తి గురించి తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

సమగ్ర శిక్షలో.. సీజనల్ దోపిడీ

● సీజనల్ హాస్టల్స్ పేరుతో ఏటా నిధులు స్వాహా

● మిర్చిగోదాములు, షెడ్లలో వసతి ● అర్హత లేని స్వచ్ఛంద సంస్థలకు బాధ్యతలు ● గతేడాది రూ. 25 లక్షల ఖర్చు..



గుంటూరు : నల్లపాడు రోడ్డులో మిర్చిగోదాములో తొడాలు తీస్తున్న వలస కూలీల పిల్లలు

ఓ రేకుల షెడ్డును.. ఆయా పేరుతో వృద్ధురాలని కూర్చోబెట్టి సీజనల్ హాస్టల్‌గా మార్చేస్తారు... మిర్చి నిల్వ చేసే గోదాములో పదిమంది చిన్నారులను కూర్చోబెట్టి వారికి పలక, బలపం ఇచ్చి కూర్చోబెడతారు. మరోచోట రెండు భవనాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో విద్యార్థులు కూర్చోబెడతారు. కనీసం సీజనల్ హాస్టల్ నిర్వహించే సంస్థ బోర్డు కూడా బయట కనిపించదు. ఇదీ జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు సీజనల్ హాస్టల్స్ నిర్వహిస్తున్న తీరు. సమగ్ర శిక్షలో కొందరు అధికారులు తమ బినామీయులైన స్వచ్ఛంద సంస్థలతో సీజనల్ హాస్టల్స్ పెట్టించి.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు స్వాహా చేస్తున్నారు. ఈ భారీ దోపిడీకి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. గతేడాది ఇదే తరహాలో భారీగా దోపిడీ చేసి.. ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో హాస్టల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

గుంటూరు (విద్య) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం బిహార్, ఒడిశా, ఝార్ఖండ్, యూపీ తదితర రాష్ట్రాల నుంచి ఏటా వేల సంఖ్యలో కార్మికులు గుంటూరు జిల్లాకు వలస వస్తారు. గుంటూరు నగరంలోని మిర్చి యార్డు, రూరల్ ప్రాంతాల్లోని క్వారీల్లో పని చేస్తారు. వారితో పాటు వచ్చిన పిల్లలు కార్మికులుగా మారకుండా వారి భాషలోనే విద్యా బుద్ధులు చెప్పించి.. పాఠశాలకు పంపించడం కోసం ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తుంది. ఇక్కడ విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్య నేర్పించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేర్పించాలి. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందజేయాలి.

నిధులు స్వాహా...

వలస కార్మికుల పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా నిధులు కేటాయిస్తుంది. నవంబరు నుంచి ఏప్రిల్ వరకు దాదాపు ఆరు నెలల పాటు ఈ సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తారు. ఇందు కోసం ఏటా దాదాపు రూ.50లక్షల వరకు కేంద్రం విడుదల చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హాస్టల్స్ ఏర్పాటులో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అర్హతలేని వారు స్వచ్ఛంద సంస్థల ముసుగులో హాస్టల్స్ ఏర్పాటు చేసి నిధులు స్వాహా చేస్తున్నారు. విద్యార్థులు లేకున్నా ఉన్నట్లు చూసి. సమగ్ర శిక్షకు బిల్లులు పెడుతున్నారు. వచ్చిన నిధుల్లో కొంత సమగ్ర శిక్షలోని కొంతమంది అధికారులకు ఇవ్వడంతో వారు హాస్టల్స్ పర్యవేక్షణ గాలికి వదిలేస్తున్నారు.

రికార్డులకే పరిమితం..

రికార్డుల్లో మాత్రం హాస్టల్స్ పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మిర్చి గోదాముల్లో, క్వారీల్లో తల్లిదండ్రులతో కలిసి పనిలో నిమగ్నమై కనిపిస్తారు. కొంతమంది పిల్లలు రోడ్ల పక్కన వ్యర్థాలు ఏరుకోవడం, వర్షపు గుంతల్లో చేపలు పడుతూ కనిపిస్తారు. ఈ పిల్లలందరూ సీజనల్ హాస్టల్స్ లోనే తప్పనిసరిగా ఉండేలా సమగ్రశిక్ష, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలి.. అయితే తూతూ మంత్రంగా నిర్వహించడంతో పిల్లలు కొద్దిసేపు హాస్టల్స్‌లో ఉండి బయటికి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్నిచోట్ల అసలు హాస్టల్స్ నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారింది.

పక్కదారి పట్టిన వసతి..

- మిర్చి యార్డు ఎదురుగా ఉన్న రామిరెడ్డి నగర్ లో రెండు సీజనల్ హాస్టల్స్‌ను ఒకే స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ఇక్కడ ఒక్కో హాస్టల్‌లో 40 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. వాస్తవంగా ఒక హాస్టల్‌లో 15 మంది లోపే విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు చెప్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే టిఫిన్ చేసి బయటికి వెళ్లారని మధ్యాహ్న భోజన సమయానికి అందరూ వస్తారని నిర్వాహకులు చెప్పడం గమనార్హం.
- చిలకలూరిపేట రోడ్డులోని ఏసుభక్త నగర్ పక్కన సీజనల్ హాస్టల్‌ను మిర్చి గోదాములో నిర్వహిస్తున్నారు. చుట్టూ మిర్చి తొడాలు తీసే గోదాములు ఉండడంతో మిర్చి కోరుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఈ గోదాములో ఫ్యాను కూడా లేకపోవడంతో పిల్లల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ హాస్టల్‌కు చెందిన కొంతమంది పిల్లలు రోడ్ల పక్కన వ్యర్థాలు ఏరుకోవడం, వర్షపు నీటి కుంటల్లో చేపలు పట్టడం చేస్తున్నారు.
- సెంట్రల్ వేర్ హౌస్ (చిలకలూరి పేటరోడ్డులో) పక్కనే మరో హాస్టల్ ఉంది. ఆయా తప్ప హాస్టల్‌లో కనీసం ఒక్క విద్యార్థి కూడా లేడు. ఈ రేకుల షెడ్డు చిన్న గాలికే ఎగిరిపోయే పరిస్థితిలో ఉంది. ఉదయం టిఫిన్ చేసి విద్యార్థులు బయటకు వెళ్లినట్లు ఆయా చెబుతోంది.
- మిర్చి యార్డ్ పక్కనే సాయినగర్‌లో ఉన్న మరో సీజన్ హాస్టల్ పేరుతే.. రెండు భవనాల మధ్య చిన్న ఖాళీ స్థలంలో విద్యార్థుల్ని కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఇలాంటి సీజనల్ హాస్టల్స్ నిధులు స్వాహా కోసమే నిర్వహిస్తున్నారా అనే అనుమానం ఎవరికైనా వస్తుంది.



గుంటూరు : ఏసుభక్తనగర్‌లో మిర్చిగోదాములో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్



గుంటూరు : ఏసు భక్తనగర్(చిలుకలూరిపేట రోడ్డులో) సీజనల్ హాస్టల్ పక్కన మురుగుకాల్వలో చేపలు పడుతున్న వలసకూలీల పిల్లలు

వారికి అర్హత ఉందా..?

వలస కూలీల పిల్లల కోసం ఏర్పాటు చేసే సీజనల్ హాస్టల్స్ నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలకు అర్హత ఉందా లేదా అనే విషయం సమగ్ర శిక్షలో అధికారులు పట్టించుకోవడం లేదు. ఓ నలభై మంది పిల్లల్ని పోగు చేసి ఒక గదిలో కుక్కి పాఠాలు చెబుతున్నట్లుగా ఫొటోలు తీసి పంపితే చాలు సీజనల్ హాస్టల్ మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో హాస్టల్ నిర్వహణకు ఏటా రూ.లక్షల ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు రాస్తున్నారని.. ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికైనా వీటి పర్యవేక్షణ గురించి ఆలోచించకపోతే ప్రభుత్వ లక్ష్యం వృథా అవుతుందని, వలస కార్మికుల పిల్లలు బాల కార్మికులుగానే మారిపోతారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న సూర్యలంక సముద్రతీరం

నిశ్శబ్దంగా.. సూర్యలంక తీరం

● కార్తిక పౌర్ణమి వేడుకలకు దూరం 'మొంథా' వల్ల తొలిసారి వెలగని దీపాలు

బాపట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కార్తిక మాసంలో భక్తులతో సందడిగా ఉండే సూర్యలంక సముద్ర తీరం ఈ ఏడాది నిర్మానుష్యంగా మారింది. సముద్రుడికి 15 రోజులుగా పూజలు అందలేదు. గతేడాది పౌర్ణమి రోజు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీ శ్రేణులు, పండితులు, భక్తులతో కలిసి సముద్ర హారతినిచ్చారు. లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఆహారం తీసుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్రతీరంలోకి భక్తులను, పర్యాటకులను అనుమతించలేదు. కార్తిక మాసంలో ఇన్ని రోజులపాటు సముద్ర తీరానికి ప్రవేశం కల్పించకపోవడం ఇదే తొలిసారి. సముద్రగర్భంలో ఏర్పడిన గుంతల వల్ల ప్రమాదాలను గ్రహించి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.



సూర్యలంకరోడ్డులో బైపాస్ ఆర్‌వోబీ పక్కనే చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాలను తీరానికి వెళ్ళకుండా ఆపుతున్న పోలీసులు

నరసరావుపేటలో
ఏసీబీ తనిఖీలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.35,000 నగదు.. రికార్డులు స్వాధీనం

నరసరావుపేట లీగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కార్యాలయంలో సిబ్బంది, అధికారులు బయటకు వెళ్లకుండా తలుపులు వేసిన అధికారులు తనిఖీలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన తనిఖీలు రాత్రి 8 గంటల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. కార్యాలయంలో లెక్కల్లో చూపని 35,000 నగదుతో పాటు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ ఏఎస్పీ మహేంద్రమాతే తెలిపారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో ఉన్న దస్తావేజులు రాసే వ్యక్తులను ప్రశ్నించారు. ఏసీబీ తనిఖీలతో ఆ ప్రాంతంలోని దస్తావేజులు రాసే వారు వారి కార్యాలయాలను మూసివేశారు. కార్యాలయంలో అవినీతి జరుగుతుందన్న ఫిర్యాదుల మేరకు ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. తనిఖీలతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తనిఖీల్లో ఏసీబీ సీఐలు వీవీ సురేష్‌బాబు, మన్మధరావు, ఎస్ఐలు ముకుంద, జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ప్రకాశం బ్యారేజి దిగువకు 70,275 క్యూసెక్కులు


తాడేపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 75,474 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 70,275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2011, పశ్చిమ డెల్టాకు 3007, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్‌లో 311.14 టీఎంసీలు..

విజయపురిసౌత్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేలు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,576, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్ ఫ్లో 44,176 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 44,176 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో 43.35 టీఎంసీలు..

అచ్చంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 43.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,260 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 17 వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

గేటు వెలికితీతకు నిపుణుల కృషి

రెంటచింతల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులోని విద్యుత్ ఉత్పత్తి చేసే తుప్పపట్టిన ఇన్ టేక్ వాటర్ గేట్‌ను వెలికి తీసే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఐదు రోజుల నుంచి నిలిచిపోయిన ఉత్పత్తిని పునరుద్ధరించడానికి నెల్లూరు నుంచి వచ్చిన సీ డైవర్స్ నిపుణులు స్థానిక ఇంజనీర్లతో కలిసి చేస్తున్న కృషి బుధవారం రాత్రికి ఓ కొలిక్కి వచ్చే అవకాశాలున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ పేర్కొన్నారు. 36 టన్నుల బరువు ఉండే ఈ గేట్‌ను పైకి తీసి ప్రత్యామ్నాయంగా స్టాప్ లాక్ గేట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.భూమి ఉపరితలం నుంచి 45 అడుగల లోతులో ఉండే వాటర్ గేట్‌ను బయటకు తీయడంలో పేరున్న ఇంజనీరింగ్ నిష్ణాతులు రంగంలో దిగారు. తొలుత 2017 జనవరి 9 నుంచి ఒక యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించగా అదే నెలలో మరో యూనిట్ ద్వారా విద్యుత్‌ను తయారు చేశారు. ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి ఎటువంటి అంతరాయలేకుండా ఉత్పత్తి జరుగుతూనే ఉంది. లక్ష్యానికి మించి విద్యుత్‌ను తయారు చేసి పలుమార్లు అవార్డులు, రివార్డులు అందుకున్న చరిత్ర కూడా ఈ ప్రాజెక్టు సొంతం.



టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో మరమ్మతులు చేస్తున్న ఇంజనీరింగ్ నిపుణులు

తెనాలి ఐకానిక్.. ఇక కనుమరుగు

● 60 ఏళ్లు సేవలు అందించిన మున్సిపల్ కార్యాలయ భవనం

● పీపీపీ విధానంలో అధునాతన నిర్మాణానికి శ్రీకారం

● అందాక కూరగాయల మార్కెట్ భవనంలో కార్యకలాపాలు

తెనాలి మున్సిపల్ కార్యాలయ భవనం



తెనాలి అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో ఐకానిక్‌గా నిలిచిన మున్సిపల్ కార్యాలయ భవనం కనుమరుగు కానుంది. 60 ఏళ్లపాటు సేవలు అందించిన ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో పీపీపీ విధానంలో అత్యాధునిక భవనాన్ని నిర్మించేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి పట్టణానికి మరో మకుటయమైన వసతిని అందించాలని నిర్ణయించారు. ఆయన గత పాలనలో విశాలమైన కూరగాయల మార్కెట్ భవనం, నాలుగు లేన్ల రహదారి వంటి పలు వసతులు తెనాలికి సమకూర్చారు. 1959లో అప్పటి మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య పేరిట చేపట్టిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నాటి మంత్రి దామోదరం సంజీవయ్య శంకుస్థాపన చేయగా, 1966 మేలో రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయాన్ని కొత్తపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించేవారు. 1909లో తెనాలి మున్సిపాలిటీగా ఆవిర్భవించి 1965లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా గుర్తింపు పొందింది. తెనాలి ప్రాధాన్యతను ప్రజలకు అందించే అన్ని రకాల ప్రసార సాధనాలు ఈ భవనాన్ని ఐకానిక్‌గా చూపేవి. ఏ రాజకీయ పార్టీ అయిన, ఏ సామాజిక వర్గం అయినా ఈ కార్యాలయం ముంగిటే సభలు, సమావేశాలు జరిపేవి. రాష్ట్ర, జాతీయ, నాయకులతో పాటు సినీనటుల సభలు ఇక్కడే జరిగేవి. మూడు అంతస్తుల్లో ఉన్న ఈ భవనం ఎక్కి మరి అభిమానులు తమ నేతలను తనివితీరా చూసుకునేవారు. మున్సిపల్ కార్యాలయ సేవలను మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ భవనంలోకి తరలిస్తున్నారు. ఇప్పటికే పలు విభాగాలకు ఏర్పాట్లు పూర్తి కాగా మరికొన్ని విభాగాలు ఇక్కడకు రావాల్సి ఉంది. ఇక నుంచి పట్టణ ప్రజలు మున్సిపల్ సేవలను కూరగాయల మార్కెట్ భవనంలోని మూడవ అంతస్తులో ఉన్న కార్యాలయం నుంచి అందుకోవాలి. నాల్గవ అంతస్తులో జీఎస్టీ కార్యాలయం నిర్వహిస్తుండగా ఒకటి రెండవ అంతస్తులు కూరగాయ మార్కెట్‌కు కేటాయించారు. పై అంతస్తుకు చేరుకోవడానికి ఒకే లిఫ్ట్ ఉండగా మరో రెండు లిఫ్టులు మరమ్మతుల్లో ఉన్నాయి. వీటిని బాగు చేయడంతో పాటు కార్యాలయంలో ఏ విభాగం ఎక్కడుందో సూచించే వివరాలను అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉంది.



కూరగాయల మార్కెట్ భవనం



మూడో అంతస్తులో ఏర్పాటు అవుతున్న విభాగాలు

పోలీసుల అదుపులో కేటుగాడు

ఒంగోలు క్రైం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తానంటూ ఒంటరి గా నివాసం ఉండే వృద్ధురాళ్లను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడే కేటుగాడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఒంగోలు నగరంలోని కమ్మపాలెం, ఇందిరకాలనీలో ఇరువురు వృద్ధురాళ్లను మోసం చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు అపహరించాడు. ఆర్నెళ్ల క్రితం ప్రభుత్వం కుట్టుమిషన్లు ఇస్తుందంటూ మాయమాటలు చెప్పి ప్లేటులో చీర, నగదు పెట్టి ఫొటో తీయాలంటూ వృద్ధురాళ్ల దృష్టి మరల్చి నగదు అపహరించుకెళ్లాడు. చీరాలలో ఇదే తరహా కేసు నమోదైంది. దీంతో బాపట్ల, ప్రకాశం జిల్లాల పోలీసులు నిఘా ఉంచారు. ప్రకాశం జిల్లా సీసీఎస్ పోలీసులు కేటుగాడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాపట్ల, ప్రకాశం, గుంటూరు జిల్లాలో సుమారుగా 30 మందిని ఈ కేటుగాడు మోసాలు చేసి నగదు దోచుకెళ్ళాడు.

10నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. 6,7 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 నుంచి 4.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 1నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి.

రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం తక్షణమే ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మాదాల నారాయణస్వామిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల జిల్లాలో భారీ నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలో 16లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులకు ఎకరాకు రూ.25నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. కార్యక్రమంలో బి.పద్మ, రాజశేఖర్, జాలన్న, తిరుమలరావు, వి.రామ్మోహన్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్టెతస్కోప్‌ల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్టెతస్కోప్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అందజేశారు. టెక్సాస్‌లో పనిచేస్తున్న అత్తిపట్ల అశోక్ కుమార్‌చౌదరి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న 12మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం వీటిని అందజేశారు. ఈ స్టెతస్కోప్‌లను విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్యసేవలకు ఉపయోగించుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుందర్, డాక్టర్ ఎం.సువర్ణరాజు, జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారి బెల్లం నరసింహారావు, 104 సర్వీసెస్ జిల్లా మేనేజర్ జిలానీ పాల్గొన్నారు.

పుస్తకాల ర్యాక్‌ల అందజేత

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 5 (ఆం ధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్ర ల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు ఐదు పుస్తకాల ర్యాక్‌లను బహూకరించారు. దాత గట్టిబోయిన నరసింహారావు అందించిన వా టిని ఒంగోలులోని జీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద స్వీకరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధు లు మాట్లాడుతూ తంగెళ్ళ, ఆలూరు జడ్పీ హైస్కూలు, ఒంగోలు బాలాజీ నగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, చేవూరు జడ్పీ హై స్కూలుకు వాటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రావిపాటి శ్రీనివాస రావు, కార్యదర్శి కొల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరామమూర్తి, రీజనల్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్యాలయం ప్రారంభం

● హాజరైన ఎంపీపీ అంజమ్మ

నాగులుప్పలపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులో ఉపాధి హామీ పథకం కార్యాలయ భవనాన్ని ఎంపీపీ నలమలపు అంజమ్మ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, ప్రత్యేకాధికారి జి.జోసఫ్‌కుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఏవో మూర్తి, కృష్ణారెడ్డి, మారెళ్ల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

మార్కాపురం జీజీహెచ్ నుంచి వైద్య సామగ్రి తరలింపు

పీపీపీ మోడ్‌లోకి వెళ్లడంతో డీఎంఈ ఆదేశం

మెరుగైన వైద్య సేవలు కష్టమే



మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల

మార్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) నుంచి వైద్య సామగ్రిని తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎమ్ఈ) డాక్టర్ జి.రఘునందన్ గత నెలలోనే ఆదేశాలు జారీ చేశారు. ఏ పరికరాలు ఏ వైద్య కళాశాలకు తరలించాలో ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కాపురానికి వైద్య కళాశాల మంజూరు కావడంతో జిల్లా వైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి జీజీహెచ్‌గా మార్పు చేశారు. అప్పట్లో వైద్య కళాశాల స్థాయికి అనుగుణంగా వైద్యులను, సామగ్రిని ఏర్పాటు చేశారు. 150 బెడ్లతో ఉన్న వైద్యశాలను 350 బెడ్లకు పెంచారు. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగాయి. అంతేకాక నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి తరగతులు నిర్వహించేందుకు సకాలంలో అనుమతులు తేలేకపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ఎలాగైనా పూర్తి చేయాలని పీపీపీ విధానంలోకి మార్చారు. ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. త్వరలో టెండర్ దక్కించుకున్న సంస్థ వైద్య కళాశాలను నిర్మించనుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఆగకుండా మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు ఉన్నఫళంగా వైద్య సామగ్రి తరలించడంతో సేవలు మృగ్యమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

సౌకర్యాలు లేకుంటే వైద్యం కష్టమే

మార్కాపురం జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పుడే ఇక్కడ నుంచి కేసులను ఇతర ప్రాంతాలకు తరలించే వాళ్లు. అప్పట్లో కూడా కేవలం చిన్నపాటి వైద్యం మాత్రమే అందించే వాళ్లు. సౌకర్యాల కల్పన వలన కొన్ని శస్త్ర చికిత్సలు చేసేందుకు వీలు ఏర్పడింది. మెడికల్ కాలేజీకి కేటాయించిన వైద్యులను ఇప్పటికే పలు ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో ఉన్న కొద్దిపాటి వైద్యులతోనే నెట్టుకొస్తున్నారు. అధునాతన వైద్య సామగ్రి తరలిపోతే రోగులకు మెరుగైన వైద్య సేవలు లభించడం కష్టమే. పీపీపీ విధానం ద్వారా టెండర్ దక్కించుకున్న సంస్థ త్వరితగతిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తేనే ప్రజలకు వైద్యసేవలందించే వీలు కలుగుతుంది. అప్పటి వరకైనా మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు వైద్య సామగ్రిని ఉంచితే సరిపోయేదని డివిజన్ ప్రజలు వాపోతున్నారు.

వైద్య సామగ్రి తరలించాలని ఆదేశాలు అందాయి

రామచంద్రరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్, మార్కాపురం

ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న 22 రకాల సామగ్రిని పలు మెడికల్ కాలేజీలకు తరలించాలని డీఎంఈ ఆదేశాలిచ్చారు. గుంటూరు మెడికల్ కాలేజీ వాళ్లు కొన్ని పరికరాలను తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు కేటాయించిన మేరకు మిగిలిన సామగ్రిని కూడా త్వరలోనే ఇతర కాలేజీల వాళ్లు తీసుకెళ్లనున్నారు. అధునాతన సామగ్రి లేకుంటే మెరుగైన వైద్యం అందించాలంటే కొంత మేర ఇబ్బందులే.

పలు వైద్య కళాశాలలకు తరలింపు

మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న మార్కాపురం సర్వజన వైద్యశాలకు గతంలో 22 రకాలైన అధునాతన వైద్య పరికాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పరిధి నుంచి మెడికల్ కాలేజీ పీపీపీ మోడ్‌లోకి వెళ్లనుండడంతో ఇక్కడ ఉన్న వైద్య సామగ్రిని రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలకు తరలించేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా 5 రకాలైన వైద్య సామగ్రిని గుంటూరు మెడికల్ కాలేజీకి మూడు రోజుల కిందట తరలించారు. అవేకాక ఇంకా 17 రకాల సామగ్రిని విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, నంద్యాల, కడప, విశాఖపట్నం, అనంతపురం, ఒంగోలు, నెల్లూరుతోపాటు మరికొన్ని వైద్య కళాశాలలకు తరలించనున్నారు. ఆయా వైద్య కళాశాలల్లో లేని సామగ్రిని ఇక్కడ నుంచి తరలించనున్నారు. మార్కాపురంతోపాటు పీపీపీ మోడ్‌లోకి తీసుకున్న ఆదోని, పులివెందుల, మదనపల్లె ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లోని సామగ్రిని కూడా ఇదే విధంగా తరలించేందుకు ఆదేశాలిచ్చారు.



జీజీహెచ్‌లో వైద్యం కోసం బారులు తీరిన రోగులు

పృథులగిరి ఘాట్ రోడ్డును త్వరితగతిన నిర్మిస్తాం

● మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



ధ్వజస్థంభానికి మొక్కుతున్న సత్య

మర్రిపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన పృథులగిరి ఘాట్ రోడ్డు నిర్మాణం పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆయన లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.. పృథులగిరి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితోపాటు తాను కూడా కృషి చేస్తున్నానన్నారు. మంత్రి స్వామి చొరవతో నాలుగు ఘాట్ రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్ల డీఎంఎఫ్ నిధులు మంజూరైయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో టెండర్ నోటిఫికేషన్ విడుదల అయ్యిందని చెప్పారు. కార్తీక మాసం ముగిసేలోపు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. నిధులు అవసరమైతే ఈ పనులు పూరి అయ్యేలోపు అదనపు నిధులు తీసుకొచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తామని చెప్పారు. పృథులగిరిని ఆధ్యాత్మిక క్షేత్రంతోపాటు, పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకముందు కొండపైకి చేరుకున్న సత్యకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు ఎర్రమోతు శ్రీనివాసులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు వేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహరావు, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, చేరెడ్డి నరసారెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, గొంటు హనుమారెడ్డి, బాలగిరి వెంకటేశ్వర్లు, కిలారి శ్రీనివాసరావు ఉన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

● పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసులు



పూజలు అందుకుంటున్న మోక్ష రామలింగేశ్వరస్వామి



కోనేరులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న రామతీర్థం మోక్షరామలింగేశ్వరాలయానికి కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా నలువైపులనుంచి భక్తులు పోటెత్తారు. పురాణ ప్రాశస్త్యం గల ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో భక్తులు పుణ్య స్నానమాచరించి మూలవిరాట్ రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ప్రత్యేకంగా నిర్వహించిన అభిషేకాలు, విశేష పూజల్లో ప్రముఖ పార్టీల నాయకులు, గ్రానైట్ వ్యాపారులు, వీఐపీలు స్వామి వారిని దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సీఐ దాసరి ప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్య, తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడరేవు సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. వివిధ కుల సంఘాల సత్రాలలో అన్నదానాన్ని నిర్వహించారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి వేడుకలును చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రం, సాక్షి రామలింగేశ్వరాలయం, వీరభద్రేశ్వరాలయం, గోనుగుంట, పల్లామల్లి, నేకునంబాదు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే జ్వాలాతోరణంను కనులపండవగా నిర్వహించారు.

కళారంగ రారాజు బండారు రామారావు



మాట్లాడుతున్న శ్రీపతి ప్రకాశం

ఒంగోలు కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళారంగంలో తిరుగులేని నటునిగా రాణించి వేలాదిమంది అభిమానులను పొందటమే కాకుండా వందలాది మంది నటులకు మార్గదర్శకులుగా నిలిచిన కళారంగ రారాజు బండారు రామారావు అని పలువురు పేర్కొన్నారు. పౌరాణిక నటులు బండారు రామారావు 49వ వర్ధంతిని బుధవారం శ్రీరామ నాట్యమండలి అధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నెల్లూరు బస్టాండు డీఆర్ఆర్ మునిసిపల్ హైస్కూల్ దగ్గర ఉన్న రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాస రావు నేతృత్వంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యాదల రాజశేఖర్, ఎద్దు శశికాంత్ భూషన్, బండారు ఆనంద రావు, శ్రీపతి సతీష్, కండే శ్రీనివాసరావు, ఉలిచి బాబూరావు, మిడసల మల్లిఖార్జునరావు, కనమాల రాఘవులు, కట్టా సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం ప్రదర్శించిన చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

మద్దిపాడులో..

మద్దిపాడు: బండారు రామారావు సేవలు యువత కొనసాగించాలని కళాకారుడు కాకుమాను సుబ్బారావు కోరారు. మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో బండారు రామారావు వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, దేవరశెట్టి ఎల్లమంద, గంట కోటేశ్వరరావు, కటకం వెంకటేశ్వర్లు, నేలటూరి సత్యనారాయణ, ఆరి సూర్యనారాయణ, సుమన్, రమేష్ పాల్గొన్నారు.

చెత్తను క్లాప్‌మిత్రలకు అందించాలి

టంగుటూరు (కొండపి) నవంబ రు 5 (ఆంధ్రజ్యోతి): గృహ యజమానులు తడిచెత్త, పొడిచె త్తలను వేరుచేసి క్లాప్‌మిత్రలకు అందించాలని డీపీవో ఎం.వెంకటే శ్వరరావు సూచించారు. బుధవారం కందులూరు గ్రామంలో డీపీవో పరిశుభ్రత, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణను ఆయన పరిశీలించా రు. ప్రతి ఇల్లూ, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేసే విధానాన్ని ఓ వీధిలో ప్రదర్శింపజేశారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీని వాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జి.రమేష్, తంబి శ్రీనివాసులు, భావన్నారాయణ పాల్గొన్నారు.

'ఉత్తమ' ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ బుధవారం మద్దిపాడులో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతను గుర్తెరిగి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఉత్తమ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మందపల్లి శ్రీనివాసరావు, గోరంట్ల చిరంజీవి, పోతినేని శ్రీనివాసరావు, మార్నేని రాఘవరావు, దుగ్గినేని నరసింహారావు, దేవబత్తిన ప్రసాద్, రావిపాటి శ్రీనివాసరావు, చెన్నుపల్లి వెంకటరమణ, గట్టినేని అయ్యన్న పాల్గొన్నారు.

బండ్లమూడిలో బాధితుడి పొలం పరిశీలన



పొలంలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కంట్లం ఏసుదాసుకు చెందిన పొలాలను బుధవారం ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ బ్రహ్మయ్యతో కలిసి సందర్శించారు. గొర్రెలు పొలంలోకి రావటం ద్వారా ఎంతమేర పంటనష్టం జరిగిందో పరిశీలించారు. సంబంధిత అధికారుల ద్వారా అంచనా వేశారు. తదుపరి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

అవీఇవీ

రోడ్లు, కాలువల పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



కలెక్టర్ రాజాబాబును సత్కరిస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో రోడ్లు, కాలువలు ధ్వంసమయ్యాయని, వాటిని పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం గొట్టిపాటి లక్ష్మితో పాటు టీడీపీ యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్‌లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించి మొక్కను అందజేశారు. ఆమె నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తుఫాన్ బీభత్సంతో నియోజకవర్గంలో జరిగిన ఆస్తి, పంట నష్టాలపై కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎస్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్ మరమ్మతులకు నిధులు మంజూరుచేయాలని కోరారు. గ్రామాల వారీగా దెబ్బతిన్న రోడ్లు, కాలువలతో కూడిన అంచనాలతో నివేదికను అందజేశారు. మిర్చి, పొగాకు, పండ్లతోటలు దెబ్బతిన్నాయని వివరించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఆయా అంశాలను ప్రభుత్వానికి నివేదించడంతో పాటు తక్షణ అవసరాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ న్యాయవాది

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పి.రాజాబాబును ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జెస్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన జి.శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబును కలిసి బొకే అందజేశారు. శ్రీకాంత్ మూడేళ్లు లేదా సర్వీసు నుంచి ప్రభుత్వం తొలగించే వరకు ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగనున్నారు.

ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులను వినియోగించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఇంటిలో స్వదేశీ వస్తువులను వినియోగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు అన్నారు. మండలంలోని మణికేశ్వరం లో బుధవారం ఆత్మనిర్బర్ భారత్ సంకల్ప అభియాన్ కార్య క్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు ఈదా చిన్న శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సు బ్రహ్మణ్యం, అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి జాగర్లమూడి యలమందరావు, గోపిరెడ్డి, సాయిబాబు, మస్తాన్‌వలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి (కొండపి) : ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులు వాడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మాకినేని నరసింహం పిలుపునిచ్చారు. జరుగుమల్లిలో బుధవారం జరిగిన ప్రతి ఇంటా స్వదేశీ వస్తువుల వినియోగం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి కోమల్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మనిర్భర భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ నినాదంపై అవగాహన కలిగిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కొండపి నియోజకవర్గ కన్వీనర్ మిడసల బాలకోటయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలి

● బాపట్ల జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో విజయలక్ష్మి

పర్చూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలు నూరు శాతం వసూలు చేసేవిధంగా ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ అధికారులను బాపట్ల జిల్లా డివిజన్ పంచాయతీ అధికారిణి విజయలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయితీ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఈకేవైసీ, బయోమెట్రిక్, ఏపీ సేవ, పాన్ కార్డు అప్డేషన్, ఎస్‌డబ్ల్యూపీసీ కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించి తగు సూచనలు ఇవ్వాలన్నారు. అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలను అన్నింటినీ సకాలంలో పూర్తిచేయాలన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యూమ్న కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యతో సతమతం

● వీధిలైట్లు సక్రమంగా వెలగని వైనం

● గ్రామాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

● 50 ఏళ్లనాటి లైన్లు కావడంతో అవస్థలు



ఏడీఏ జె.శ్రీనివాసులకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

చెన్నుంబొట్ల అగ్రహారం (పర్చూరు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మా గ్రామంలో గత 50 ఏళ్ల క్రితం విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేయటంతో స్తంభాలు ఒరిగిపోయి, విద్యుత్ వైర్లు తెగిపోతూ తరచు విద్యుత్ మరమ్మత్తులకు గురికావాల్సి వస్తుందని, దీంతో విద్యుత్ సమ్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం వాసులు విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. బుధవారం గ్రామ సర్పంచ్ మానం సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయానికి చేరుకొని ఏడీఇ జె.శ్రీనివాసులుకు వినతి ప్రతం అందజేశారు. విద్యుత్ లైన్లు దెబ్బతినటం వల్ల గ్రామ పంచాయితీ వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్న కేబుల్స్ కాలిపోవటం, తరచు మంటలు రావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామం అందకారంలో ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. వీధిలైట్లు ఏర్పాటు నిర్వహణ పంచాయితీకి బారంగా మారిందని, తక్షణమే దెబ్బతిని వరిగిపోయిన స్తంబాలతోపాటు, విద్యుత్ కేబుల్‌ను కూడా మార్చి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడీఇని కోరారు.

అవీ..ఇవీ..

తీరంలో కోతకు గురైన ప్రాంతాల పరిశీలన

- కార్తీక స్నానాల్లో భక్తులకు ఇబ్బందులు
- అన్ని చక్కబడ్డాకే అనుమతులు
- టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



తీరంలో కోతకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న మహేంద్రనాథ్

వాడరేవు(చీరాల), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం స్నానాలకు భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు. అయినా ఎటువంటి ప్రాణనష్టం లేకుండా ఉండేందుకే తీరంలోకి అనుమతులు రద్దు చేసినట్లు టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం మహేంద్రనాథ్ వాడరేవు, రామాపురం తీరంలో కోతకు గురైన ప్రాతాలను పరిశీలించారు. వేటపాలెం, ఈపూరుపాలెం పోలీసులతో మాట్లాడి సమస్య తీవ్రత తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా భారీ కోతలు ఏర్పడినట్లు చెప్పారు. మరి కొద్ది రోజులు అనుమతులు ఉండవని చెప్పారు. పరిస్థితులు చక్కబడ్డాక యథాతథంగా తీరానికి పర్యాటకులకు అవకాశం కల్పిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతోందని, అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జాండ్రపేట, అక్కయ్యపాలెం రోడ్డు, గుమస్తాల కాలనీ, అయోధ్యనగర్ ప్రాంతాలకు అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రామస్తంభం వీధి, పోలేరమ్మ గుడి, పాపరాజుతోట ప్రాంతాల్లో సేవలకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి : అద్దంకిలో విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని శ్రీనగర్, అన్నాక్యాంటిన్, ఎస్ఎస్‌పీ కార్యాలయం, మార్కెట్‌యార్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామేపల్లి కల్యాణ మండపం వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మండలంలోని వెంకటాపురానికి చెందిన కిరణ్ బుధవారం సాయంత్రం అద్దంకి నుండి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడి గాయలాయ్యాయి. క్షతగాత్రుడు కిరణ్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

చినగంజాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామానికి చెందిన గడ్డం కోటేశ్వరమ్మకు అదేగ్రామానికి చెందిన మద్దిన మణికంఠ శ్రీనివాస్ అలియాస్ మణికంఠ, మద్దిన సోమయ్య, మద్దిన సుజాతలకు మధ్య గతంలో మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 29న ఆమెతో ఘర్షణ పడ్డారును కోటేశ్వరమ్మను మణికంఠ పక్కనే ఉన్న కర్రనుదాడి చేశాడు. సోమయ్య సుజాతలు అయనకు సహకరించారు. దాడిలో గాయపడిన కోటేశ్వరమ్మ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.పేరిలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు. నింధితుడుని పోలీసులు అరెస్టు చేయగా, ఈ 19 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం



అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవీధి పాలెం గ్రామంలో వడ్లమూడి వెంకట్రావుకు చెందిన రేకుల ఇంటిలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహంలోని వస్తువులు దగ్ధమయ్యాయి. దీంతో బాధిత కుటుంబానికి పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి అందజేసిన రూ20 వేల నగదును బుధవారం మండల టీడీపీ నాయకులు వడ్లమూడి వెంకటరావుకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్, కొండ్రగుంట శ్రీహరిబాబు, నక్కల వీర రాఘవులు, వడ్లమూడి సత్యనారాయణ, పీతా రాంబాబు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సాయం



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ప్రశాంతి

మార్టూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా మండలంలోని కోనంకి గ్రామంలోని వరదబాధిత కుటుంబాలకు బుధవారం అధికారులు తక్షణ సాయాన్ని అందజేశారు. గ్రామ టీడీపీ నాయకులు కోటపాటి సురేష్ ఆధ్వర్యంలో సమతానగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాదిత కుటుంబాలకు నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, బంగాళాదుంపలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 174 కుటుంబాలకు నిత్యావసరాలను అందజేస్తా మన్నారు. అంతేగాకుండా బాదిత కుటుంబాలకు నగదును కూడా పంపిణీ చేశామని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో సుబ్రహ్మణ్యం, మాజీ మండల ఉపాధ్యక్షురాలు కోటపాటి కోమలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేయాలి

- రైతుసంఘం మహాసభలో రాష్ట్రకమిటీ సభ్యులు జయంతిబాబు

ఇంకొల్లు, నవంబరు 5,(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కలిపించాలని రైతుసంఘం రాష్ట్రకమిటీ సభ్యులు జయంతిబాబు డిమాండ్ చేశారు. ఇంకొల్లులో రైతుసంఘం 3వ మహాసభలు బుధవారం బాచిన కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి తలపనేని రామారావు,జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు,ఎర్రం గోవిందరెడ్డి,పేర్ని నాగేశ్వరరావు,సిఐటియు నాయుకులు నాగండ్ల వెంట్రావు, తన్నీరు గోవిందురాజులు, అన్నెం ఆదెయ్య, మాదాల అంజియ్య, మక్కెన హరిబాబు, ఆదినారాయణ, చిలుకూరి శ్రీనివాసరావు, కొల్లూరి హనుమంతరావు, వలేటి అంజియ్య తదితరులు పాల్గొన్నారు.







అద్దంకిలోని వేయిస్తంభాల గుడిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, మణికేశ్వరంలో బారులుతీరిన భక్తులు, కొణిదెనలో బ్రహ్మకుండంలో భక్తుల స్నానాలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- శివాలయాల్లో దీపాలు వెలిగించిన మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- తీరవెంట భక్తులకు అనుమతి నిరాకరణ

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా చినకాశీగా పేరుగాంచిన మణికేశ్వరానికి బుధవారం భక్తులు పోటెత్తారు. గతంలో ఎన్నడూలేని విధంగా భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించుకొని మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో మధ్యాహ్నం వరకు భక్తులు బారులుతీరి స్వామి వారిని దర్శించు కున్నారు. సాయంత్రం దేవాలయంలో దీపోత్సవము వైభవంగా నిర్వహించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు నిండుగా ఉండడం, ఇటీవల వరదల నేపథ్యంలో భద్రతా చర్యలలో భాగంగా దేవాలయం పక్కనే ఉన్న గుండ్లకమ్మ నదిలోని స్నానాలఘాట్‌లను మూసి వేశారు. కొద్దిమంది మహిళలు మాత్రం సమీపంలో గుండ్లకమ్మ నదిలో కార్తీక దీపాలను వదిలారు. దేవస్థానం ఈవో గుంటుపల్లి వాసుబాబు, సీఐ సుబ్బరాజుల ఆధ్వర్యంలో దేవాలయం వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. అద్దంకి పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాలగుడి, కమఠేశ్వరాలయంలలో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బల్లికురవ : మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న ప్రసిద్ధ బ్రహ్మకుండం కొలనులో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు కార్తీక స్నానాలు చేశారు. సామన్యశకం 11 వ శతాబ్ధపు నాటి కాలం నుంచి ఉన్న బ్రహ్మకుండంలో స్నానాలు చేస్తే పాపాలు హరించుకుపోతాయని ప్రజలకు అపార నమ్మకం ఉంది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి భక్తులు వాహనాలను ఏర్పాటు చేసుకుని బుధవారం తెల్లవారు జాము నుండే బ్రహ్మకుండం వద్దకు చేరుకొని స్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల మంది భక్తులు స్నానాలనకు రావడంతో బ్రహ్మకుండం పోటేత్తింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు కొలనులో స్నానాలు చేయగానే పక్కనే కుళాయిల ద్వారా కూడా నీటిని అందుబాటులో ఉంచారు. అలానే గ్రామంలో ఉన్న భవాని శంకర స్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వల్లాపల్లి గ్రామం వద్ద ఉన్న అడవి పేరాంటలమ్మ దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బల్లికురవ గ్రామానికి చెందిన చిన్నారులు కోలాట ప్రదర్శన ప్రజలను ఆకట్టుకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు శ్రీశైలం, కొటప్పకొండలకు బారీగా తరలి వెళ్లారు.

సంతమాగులూరు : కార్తీక పౌర్ణమి పురస్కరించు కొని బుధవారం కొప్పరం గ్రామంలో వేంచేసిన శ్రీ బాల త్రిపురసుందరి త్రిపురాంతకేశ్వర స్వామి వారికి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి: శింగరకొండలో పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, పూజారులు లక్ష తమలపాకులతో విశేషంగా అలంకరించారు. ఉభయ దాతలుగా కొల్లూరుకు చెందిన సమ్మెట వెంకటసాయి శ్రీహర్ష, విమలాదేవి దంపతులు వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్చూరు/ కారంచేడు : కార్తీక పౌర్ణమి వేడుకలను పర్చూరు, కారంచేడు మండలాల్లోని ఆయా గ్రామాల్లో భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుండే ఆయా శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివార్ల భక్తిని చాటుకున్నారు. పర్చూరులోని భీమేశ్వరస్వామి, ఉప్పుటూరులోని అమరేశ్వరస్వామి, నూతలపాడులోని శివాలయం, నాగులపాలెంలోని నాగేశ్వరస్వామి ఆలయంతోపాటు, చెరుకూరు గ్రామంలోని అగస్త్వేశ్వర స్వామివార్ల ఆలయంలో కార్తీకపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దేవాదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావు సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా పర్చూరులోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన దీపోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం పెద్దఎత్తున ఆలయ ప్రాంగణంలో అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో ఘనంగా అలంకరించారు. అదేవిధంగా మండలంలోని అడుసుమల్లి గ్రామంలోని గౌరీ శంకర ఆలయంలో కోటి దీపోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.

మార్టూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి మార్టూరు సమీపంలోని అమరావతి నూలు మిల్లు ఎదురుగా ఉన్న నాగార్పమ్మ దేవాలయంలో 50 కిలోలు కర్పూరంతో అఖండ కర్పూరపు జ్యోతిని వెలిగించారు. భక్తులు జ్యోతిని దర్శించుకొని పులకించారు. మార్టూరు గ్రామానికి చెందిన వసంతరావు ఆర్థిక సహకారం అందించగా కర్పూరపుజ్యోతిని అర్చకులు వెలిగించారు. మార్టూరు, జొన్నతాళి, ఇసుకదర్శి గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకొని కర్పూరపు జ్యోతిని తిలకించారు. అనంతరం భక్తులకు కమిటి సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంకొల్లు : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో భక్తులు బారులుతీరారు. బ్రహ్మముహూర్తంలో వేకుమజామున పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆయా ఆలయాల్లో అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు. శివుడికి అహిషేకాలు చేయించారు. ఇంకొల్లు శివాలయం మహిళలతో కిక్కిరిసింది. పూజారి సదాశివశాస్త్రి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అరుణాచల శివ అర్థఏకాహం కార్యక్రమాన్ని సంకీర్తానాచార్యులు మద్దినేని ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మిండాల నాగేశ్వరి, ఘంటా సుకన్య, నాదెండ్ల పార్థసారధి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

చినగంజాం : అత్యంత ప్రవితమైన కార్తీక మాసంలో వచ్చే కార్తీక పౌర్ణమిని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శైవక్షేత్రాలు ఓంకారనాదంతో మారుమోగాయి. కార్తీక దీపాలు వెలిగించి ముక్కంటి సేవలో తరించారు. మండల పరిధిలోని శివాలయాలలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శైవక్షేత్రాల వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొంథా తుఫాన్ కారణంగా సముద్రంలో గుంతలు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్రతీర ప్రాంతాలను మూసివేశారు. తీరప్రాంతాల్లోని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఎవరు రాకుండా ఇంకొల్లు సీఐ వై.వీ.రమణయ్య ఆధ్వర్యంలో ఎస్.ఐ. శీలం రమేష్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు.









సంతమాగులూరులోని త్రిపురాంతకేశ్వరస్వామి, ఆకుపూజలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, నాగార్పమ్మ ఆలయంలో అఖండ కర్పూరజ్యోతి, ఇంకొల్లులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

పలువురు సభ్యుల గైర్హాజరు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన మొక్కుబడిగా సాగింది. మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా ఎంపీపీ మినహా చినకొత్తపల్లి, శంఖవరప్పాడు, మోదేపల్లి, కలవకూరు, తిమ్మాయపాలెం ఎంపీటీసీలు రాగా తిమ్మాయపాలెం ఎంపీటీసీ సభ్యుడు అడుసుమల్లి బాలమురళీకృష్ణ తమ గ్రామ సమస్యను ఎంపీడీవో వరూధిని ని ఛాంబర్‌లో కలిసి సమావేశానికి రాకుండానే వెళ్లిపోయారు. టీడీపీ ఎంపీటీసీలతో పాటు పలువురు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. హాజరైన ఎంపీటీసీలతో పాటు ఎంపీపీ సహా ఏ ఒక్కరు కనీసం నోరు విప్పి ఏ సమస్యను ప్రస్తావించలేదు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కాగా, మరికొన్ని శాఖల నుంచి మాత్రం మొక్కుబడి గా తమ సిబ్బంది ని పంపించి సరిపెట్టారు. మూడు నెలల కొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి వచ్చి సమస్యలపై చర్చించే తీరికి ఎంపీటీసీలకు, అధికారులకు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమావేశంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మొంథీ తుఫాన్ ప్రభావంతో రైతులకు రూ.1.20 కోట్లతో నష్టం వాటిల్లినట్లు అంచనాలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఎంఈవో కేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 7 పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినందున వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని 36 గ్రామాలలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీడీవో వరూధిని, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధరరావు, విద్యుత్ ఏఈ శివప్రసాద్, ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి, హార్టికల్చర్ అధికారి దీప్తి పలు శాఖల అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

రహదారి మరమ్మతు పనుల ప్రారంభం

అద్దంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కోతకు గురైన రోడ్డు, వంతెనలపై రాకపోకల పునరద్ధరణకు మరమ్మతు పనులు ప్రారంభించారు. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం నుంచి చీమకుర్తి మండలం ఇలపావులూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో మోదేపల్లి వద్ద చిలకూరు ఉధృతికి రోడ్డు పూర్తిగా కోసుకు పోయింది. దోర్నపువాగు ఉధృతికి పేరాయ పాలెం వద్ద వంతెన, రోడ్డు కోసుకు పోయింది. ఈ నేపథ్యంలో శనివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మర్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మంగళవారం మరమ్మతు పనులు ప్రారంభించారు. మోదేపల్లి వద్ద రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి బుధవారానికి రాకపోకలు పునరుద్ధరించారు. పేరాయ పాలెం వద్ద ఎక్కువభాగం కోతకు గురికావడంతో తాత్కాలిక మరమ్మతులు ఇంకా కొనసాగు తున్నాయి. ఎట్టకేలకు రాకపోకలు తాత్కాలి కంగా పునురుద్ధరించారు.



మోదేపల్లి వద్ద కొట్టుకుపోయిన రహదారి, వంతెన (ఫైల్)





మోదేపల్లి వద్ద, దోర్నపువాగు వద్ద తాత్కాలికంగా చేసిన మరమ్మతులు

టీడీపీ పట్టణ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం







అరిగల నాగరాజు, దొప్పలపూడి ప్రసాద్, యనిగండ్ల శ్రీనివాసరావు

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ టీడీపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక పోతురాజుగండిలోని పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరిగల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా దొప్పల పూడి ప్రసాద్, ప్రధానకార్యదర్శి గా యనగండ్ల శ్రీనివాసరావు, కోశాధి కారిగా మామిడి రాంబాబు, కార్య నిర్వాహక కార్యదర్శులు గా ఇక్కుర్తి శ్రీనివాసరావు, షేక్ మహబూబ్, అద్దంకి ఏడుకొండలు, కార్యదర్శులుగా కన్నెబోయిన మణికంఠ, పప్పుల శ్రీనివాసరావు, బండారు వెంకటరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ కి ఎంపికైన నేతలు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయటం తో పాటు ప్రభుత్వ కార్య క్రమాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. తమ నియామకానికి సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పట్టణ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ సాగుతో భూసారం పెంపు

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటసాగులో సేంద్రియ పద్ధతులు అవలంభించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులు ఉపయోగించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. అనంతరం వరిపొలాలను పరిశీలించారు.

సెయింట్ ఆన్స్‌లో ఓరియెంటేషన్ కార్యక్రమం



ఓరియెంటేషన్ నిర్వహిస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యావకాశాలు సకాలంలో అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలని సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో బీ.ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ నిర్వహించారు. హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో ఔషధాలు, డ్రగ్ ప్రిస్క్రిప్షన్‌కు సంబంధించి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. వీవీ.నాగేశ్వరరావు, డైరక్టర్ డా.సుబ్బారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.జగదీష్ డా.శామ్సన్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా పశువుల దాణా పంపిణీ



పశుపోషకులకు దాణా అందజేస్తున్న అధికారులు

చినగంజాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం పశుసంరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో పశువులు ఉన్న ప్రతి రైతుకు ఉచితంగా పశు ఆహారదాణా బస్తాలను ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించినట్లు చినగంజాం పశువైద్యాధికారి బత్తుల కృష్ణ తెలిపారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మండలంలోని కొత్తపాలెం రైతుసేవా కేంద్రంలో బుధవారం పశు ఆహారా దాణా బస్తాలను పశుపోషకలకు ఉచితంగా పంపిణి చేశారు. మండల పరిధిలోని కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, చినగంజాం, సోపిరాల, పూలవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన 70 మంది పశుపోషకులకు దాణా బస్తాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. గురువారం కూడా పంపణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెదగంజాం జూనియర్ వెటన్నరీ అధికారి కిషోర్, వెటన్నరీ అసిస్టెంట్ మెబీనా, పశు సహాయకులు కుమార్, టీడీపీ నాయకులు రేవు నాంచార్లు, రాజు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, పత్తిపాటి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించాలి

అద్దంకి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ను నివారించాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెంలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చింతా వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది ప్రత్యూష, శేషారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ పర్యటన

బల్లికురవ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలోని కొత్తూరు, కొప్పెరపాడు గ్రామాలలో నేడు గురువారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు కొప్పెరపాడు, జమ్మలమడక రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం చేపట్టనున్నారు. 10 గంటలకు కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నారు.